క్లుప్తంగా

ఘనంగా దస్తగిరిస్వామి ఉరుసు



కోతికొండలో దస్తగిరి స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

తుగ్గలి : మండల పరిధిలోని కోతికొండలో దస్తగిరిస్వామి ఉరుసు ఉత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కులమతాలకతీతంగా దర్గాలో ప్రత్యేక పూజలు చేసి చక్కెర చదివింపు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి పూలచద్దర్‌ను గుర్రంపై ఉంచి మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

3న తలనీలాల వేలంపాట

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో రంగనాథ స్వామి దేవాలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలను ఏడాది పాటు పోగు చేసుకునే హక్కుల కోసం జనవరి 3వ తేదీ ఉదయం 11 గంటలకు ఈ టెండర్, సీల్డ్ కొటేషన్, బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ దస్తగిరి గౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ వేలంపాటల్లో పాల్గొనాలనుకునే వారు లక్ష రూపాయలు దరావత్తు చెల్లించాలన్నారు. వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పుష్పగుచ్ఛాలు వద్దు.. పుస్తకాలు ముద్దు



కంగాటి శ్రీదేవి

పత్తికొండ టౌన్/కృష్ణగిరి: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పాలనలో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని, ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. సోమవారం కొత్త సంవత్సరం సందర్భంగా పత్తికొండలోని స్వగృహంలో అందుబాటులో ఉంటానని శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చేవారు పూలబొకేలు, పూలమాలలు గాకుండా విద్యార్థులకు సహకారం అందించేలా పెన్నులు, పుస్తకాలు తదితర సామగ్రి అందించాలని కోరారు.

నూతన సంవత్సర వేడుకలకు మంత్రి దూరం

ఆలూరు: నూతన సంవత్సరం వేడుకలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సోమవారం అందుబాటులో ఉండడం లేదని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన వెలువడింది. మంత్రి కుటుంబ సభ్యులతో తిరుమల వేంకటేశ్వర స్వామికి మొక్కుబడులను చెల్లించుకునేందుకు వెళ్లిన నేపథ్యంలో స్థానికంగా అందుబాటులో ఉండడం లేదు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ఆలూరుకు రావొద్దని సూచించారు.

పింఛన్ పెంపుపై హర్షం

ఆలూరు: ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనవరి నెల నుంచి సామాజిక పింఛన్ సొమ్మును రూ.3 వేలకు పెంచడం వల్ల లబ్ధిదారులకు మేలు కలుగుతుందని ఆలూరు జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని 5680 మంది లబ్ధిదారులతో పాటు కొత్తగా అర్హత సాధించిన వారికి రూ.3వేల పింఛన్ అందజేయనున్నట్లు చెప్పారు. ఆయన ఆదివారం ఆలూరులో మాట్లాడుతూ..ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కరోనాతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నప్పటికీ వెనకడుగు వేయకుండా పేదల సంక్షేమం కోసం పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్నను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

నాడు పీడ కల.. నేడు పింఛన్ల జాతర

- టీడీపీ హయాంలో అందని ద్రాక్ష
- జగనన్న పాలనలో అర్హత ఉంటే చాలు ఇంటి వద్దకే పింఛను
- పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచడంపై హర్షం



హొళగుంద: సామాజికపింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పండుగ చేసింది. ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా పింఛన్ సొమ్ము పెంచుతూ ప్రతినెలా ఠంచనుగా 1వ తారీఖునే వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందించడంతో వారి ఆనందం మాటల్లో చెప్పాలేదని. గత టీడీపీ హయాంలో పింఛను మంజూరైనా నగదు తీసుకునేందుకు పడిన కష్టాలను గుర్తు చేసుకుంటే వృద్ధులు వణికిపోతుంటారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పీడకలలను మరిచి పింఛన్ లబ్ధిదారులు ప్రతి నెలా 1వ తేదీన పింఛన్ల జాతరను చూస్తున్నారు.

గత టీడీపీ హయాంలో పింఛన్ పొందాలంటే నేతల చుట్టూ ప్రదక్షిణలు, జన్మభూమి కమిటీల దయ తప్పనిసరి. అది కూడా టీడీపీ కార్యకర్తలకే పరిమితం. మిగతా వారికి పింఛన్ అందని ద్రాక్షే. ఇవన్నీ దాటుకుని పింఛను మంజూరైనా నగదు తీసుకోవాలంటే నరకం కనబడేది. వృద్ధులు పంచాయతీ కార్యాలయాలకు వెళ్లి గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. బయోమెట్రిక్ మిషన్‌లో వేలిముద్రలు పడకపోతే పల్లెల నుంచి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం, పింఛన్లు పంచే అధికారులు, ప్రజాప్రతినిధులు, దళారుల చుట్టూ తిరగాల్సి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రతి నెలా పండుగలా సాగుతోంది. నెల మొదటి రోజే ఇంటి వద్ద నగదు చేతికందుతుండడంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేటి నుంచి పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచడంతో లబ్ధిదారుల ఆనందం రెట్టింపవుతోంది.



నేడు - హొళగుందలో అంధురాలికి ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందిస్తున్న వలంటీర్



నాడు - టీడీపీ హయాంలో 6 కి.మీ నడిచివచ్చి ఎంపీడీఓ కార్యాలయం వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న ముద్దటమాగి లబ్ధిదారులు

భారీగా పెరిగిన లబ్ధిదారులు

టీడీపీ హయాంలో మండలంలో దాదాపు 3,500 మందికి పింఛన్ ఇచ్చేవారు. నేడు జగనన్న పాలనలో మండలంలో మొత్తం 6,084 మంది పింఛన్‌దారులున్నారు. ఈ సంఖ్య జనవరిలో మరింత పెరగనుంది. ఇందులో వయోవృద్ధులు, దివ్యాంగులు, డయాలసిస్ పేషెంట్లు, వితంతువులతో పాటు డప్పు కళాకారులు, చర్మకారులున్నారు. మండలంలో 16 గ్రామ సచివాలయాలు ఉండగా 239 మంది గ్రామ వలంటీర్ల ద్వారా నెలకు దాదాపు రూ.1.20 కోట్ల పింఛన్ సొమ్ము పంపిణీ జరుగుతోంది.



నేడు - పెద్దగోనెహాళ్‌లో పొలం వద్దకే వెళ్లి పింఛన్ ఇస్తున్న వలంటీర్ (ఫైల్)

పింఛన్ల పంపిణీలో రికార్డు

గతంలో టీడీపీ హయాంలో నెల ప్రారంభం నుంచి దాదాపు 15 రోజుల వరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 1వ తేదీన వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేస్తూ సీఎం వైఎస్ జగన్ ఆశయం నెరవేర్చుతున్నారు. మొదటి రోజే 90 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు అందుతున్నాయి.

వంద శాతం పింఛన్ల పంపిణీ లక్ష్యం



వంద శాతం పింఛన్లను పంపిణీ చేయడమే మా లక్ష్యం. బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేసుకునేందుకు ఆలస్యం కావడం, లబ్ధిదారులు ఇంటి వద్ద ఉండకపోవడం, వేరే ఊర్లకు వెళ్లడం, వైద్య సేవలు తదితర కారణాలతో అక్కడక్కడా కాస్త ఆలస్యమవుతోంది. జనవరి నుంచి కొత్తగా మంజూరైన పింఛన్లతో పాటు పెరిగిన సొమ్మును లబ్ధిదారులకు అందిస్తాం.

– సుభాషిణి, ఎంపీడీఓ, హొళగుంద

పేదలకు అండగా సీఎం జగన్

నాకు కళ్లు కనబడక ఉన్న ఒక్కగానొక్క కూతురు భవిష్యత్తును తలుచుకుని ఆందోళన చెందుతున్న సమయంలో ఇతరులపై ఆధారపడకుండా ధైర్యంగా బతికేలా సీఎం వైఎస్ జగనన్న భరోసా కల్పించారు. ఇంతకుముందు మాలాంటి పేదలకు పింఛన్లు వచ్చేవి కావు. మా గురించి ఆలోచించే వాళ్లు తక్కువ. ఇప్పుడు సీఎం జగన్ ఆ పరిస్థితిని మార్చి అర్హత ఉంటే ఇంటి వద్దకే పింఛన్ సొమ్ము పంపుతున్నారు.ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ సొమ్ము అందుతుండడంతో మా కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుంది.

– కురువ మహంకాళమ్మ, అంధురాలు, హొళగుంద

ఆపద్బాంధవుడు జగనన్న



భర్త చనిపోయి ముగ్గురు పిల్లలతో బతుకుతున్నాను. వారి చదువులు, బాగోగులు చూసుకునేందుకు కష్టాలు పడుతున్న నాకు సీఎం జగనన్న ఆపద్బాంధవుడిగా నిలిచాడు. వైఎస్సార్ వల్ల అందరికీ పింఛన్లు వస్తుంటే ఆయన కుమారుడు జగనన్న పింఛన్‌సొమ్ము మరింత పెంచి ఆసరాగా ఉంటున్నారు. ప్రస్తుతం పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచడంతో మాలాంటి వారికి కొండంత ధైర్యం వచ్చింది. అలాగే అమ్మఒడి కింద ఏడాదికి రూ.15 వేలు ఇస్తున్నారు. మాలాంటి పేదలకు ఇంతకన్నా ఇంకేమి కావాలి.

– రహిమాబీ, హొళగుంద

బ్రాహ్మణ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



ఎమ్మిగనూరులో వేద గాయత్రి సేవా సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వేద గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం తన నివాసంలో ఎమ్మెల్యే చెన్న కేశవరెడ్డి ఆ సంఘ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘ పెద్దలు ఎమ్మెల్యేను ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. సంఘ పెద్దలు రఘునందన, న్యాయవాది గురురాజారావు, దత్తాత్రేయ స్వామి, ప్రసాద్, రాజశేఖర్, శ్రీనివాసమూర్తి, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని టౌన్ బ్యాంక్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆవిష్కరించారు. బ్యాంకు సీఈఓ గంగాధర్, డైరెక్టర్లు సయ్యద్‌చాంద్, శ్రీరాం, రంగన్న, రకాక్, పల్లవి రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గ ప్రజలు, అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కొత్త సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. అధికారులు కొత్త సంవత్సరంలో మరింత ఉత్సాహంతో పని చేయాలని సూచించారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



హొళగుంద: మండల కేంద్రంలో వెలిసిన శ్రీసిద్ధేశ్వరస్వామికి ఆదివారం ధనుర్మాస పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉత్సవమూర్తికి నిత్య రుద్రాభిషేక పూజలు నిర్వహించి జలాభిషేక పూజ, ఆకుపూజ, కుంకుమార్చన, బిల్వార్చన, పంచామృతాభిషేకం తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు రాజపంపన్న గౌడ్, శివశంకర్‌గౌడ్, సిద్దార్థ గౌడ్, ఆలయ అభివృద్ధి, దాసోహ కమిటీ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. ఈ నెల 15న రుద్రాక్షేక పూజలు ముగుస్తాయని భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు ధర్మకర్తలు తెలిపారు.

3న అర్చకుల సమావేశం

హొళగుంద: హొళగుంద సిద్దేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 3న జరిగే అర్చకుల సమావేశానికి మండలంలోని అర్చకులు హాజరు కావాలని సంఘం నాయకులు హనుమంతురాయుడు, సుళువాయి రంగస్వామి, యంకయ్య, మంజునాథ్ తదితరులు కోరారు. ఆదివారం వారు హొళగుందలో మాట్లాడుతూ భూరక్షణలో భాగంగా మండలంలోని దేవదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా, 43 రిజిస్టరు నమోదు తదితర అంశాలపై చర్చించేందుకు సమావేశం నిర్వహించనున్నామని అందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారులు

హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, అభిషేకాలు, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, పూల సేవ, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. స్వామిని దర్శించుకోవడానికి కర్ణాటక, ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

అ'పూర్వ' కలయిక



ఆలూరు ప్రభుత్వ బాలుర-2 హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆలూరు: స్థానిక ప్రభుత్వ బాలుర-2 హైస్కూల్‌లో 1988 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఆదివారం ఆలూరు తహసీల్దార్ రామాంజనేయులు ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.. పూర్వవిద్యార్థులు గిరిబాబు, వైకుంఠంశివప్రసాదు, జీరాగౌడు, తదితరులు పాల్గొని పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. వివిధ రంగాలలో ఎదిగిన చిన్ననాటి మిత్రులు తిరిగి కలుసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. పాఠశాలలో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు యూనిఫాం సమకూర్చేందుకు తీర్మానం చేసుకున్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



నందవరం కొత్త బీసీ కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ జయన్న

నందవరం: గ్రామాల్లో అభివృద్ధి పనులో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణాలు వేగవంతంగా సాగుతున్నాయి. ఆదివారం మండల కేంద్రంలోని కొత్త బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పీఆర్ ఏఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేజర్ పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.15లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. అలాగే గిర్ని కాలనీలో మరో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు పూర్తి చేశామన్నారు. పనుల్లో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

శరవేగంగా సీసీ రోడ్డు నిర్మాణం



మద్దికెరలో రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

మద్దికెర: స్థానిక గ్రామ సచివాలయం -2 పరిధిలో స్టోర్ రాముడు ఇంటి వద్ద నుంచి ప్రతాప్ వెల్డింగ్ షాప్ వరకు రూ.3.70 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నట్లు ఏఈ మోహన్ నాయక్ తెలిపారు. ఆదివారం సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.



బీమా తక్షణ సాయం అందజేత

హాలహర్వి: మండలంలోని కొక్కరచేడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ, నాయకులు ఆదివారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.10 వేలు అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. నాయకులు నారాయణ, భాస్కర్, వలంటీర్లు పాల్గొన్నారు.

ధర్మం మనల్ని రక్షిస్తుంది

వెల్దుర్తి(కృష్ణగిరి): జీవిత కాలంలో చేసిన మంచి, ఆచరించిన ధర్మం మనల్ని రక్షిస్తుందని వెల్దుర్తి సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ దశరథరామిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఓం శాంతి ఆర్గనైజేషన్ బ్రహ్మకుమారీస్ ధ్యాన మందిరంలో నూతన సంవత్సర ఆహ్వాన వేడుక, బ్రహ్మలోక నివాసి బాబా సందేశ కార్యక్రమం నిర్వాహకులు బ్రహ్మకుమారీ (బీకే) సవితక్క, బీకే సుబ్బమ్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. అతిథులైన సీఐ, మాజీ ఎంపీపీ, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం అనంతరం కేక్ కట్ చేశారు. మాజీ ఎంపీపీ సతీమణి బొమ్మన శోభ, భక్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ల టైర్లు చోరీ

కృష్ణగిరి: స్థానిక బీఆర్ అంబేడ్కర్ పాఠశాల పక్కన ఉన్న వైఎస్సార్ సుజల మదర్ ప్లాంట్ వద్ద ఉంచిన ట్రాక్టర్ల టైర్లు చోరీకి గురయ్యాయి. ప్లాంటు వద్ద ఉన్న నాలుగు ట్రాక్టర్లకు గాను మూడు ట్రాక్టర్లకు సంబంధించి ముందు, మధ్య, వెనుక భాగంలో ఉన్న ఆరు టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి ఎత్తుకెళ్లినట్లు మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరి తెలిపారు. ఆదివారం ఉదయం ప్లాంటు వద్ద పని చేసే వ్యక్తి వీటిని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పరిశీలించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. వీటి విలువ రూ.లక్ష ఉంటుందని ఆయన తెలిపారు.



కంబాలపాడు సమీపంలో ట్రాక్టర్ల టైర్లను అపహరించిన దృశ్యం











